ఆంధ్రజ్యోతి
andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.3 ; కనిష్ఠం 27.3
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
మంగళవారం 13 మే 2025



నేడు పాలిసెట్

నిజామాబాద్ అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం మంగళవారం పాలిసెట్ 2025 ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించే పరీక్ష కోసం నగరంలో 16 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 6542 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. నిమిషం నిబంధన అమల్లో ఉన్నందున విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. పరీక్ష నిర్వాహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా కన్వీనర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు.

రెడ్‌క్రాస్ సేవలు ప్రశంసనీయం: కలెక్టర్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

నిజామాబాద్ అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా తోట రాజశేఖర్ అందిస్తున్న సేవలు అభినందనీయమని కలెక్టర్ రాజీవ్‌గాంధీ అన్నారు. రాజశేఖర్‌కు జాతీయ స్థాయిలో రెడ్‌క్రాస్ అవార్డు వచ్చిన సందర్భంగా సోమవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆయనను అభినందించి రెడ్‌క్రాస్ ద్వారా చేపడుతున్న సేవలను ప్రశంసించారు. అనేక సంవత్సరాలుగా సేవ కార్యక్రమాలు కొనసాగించడం అభినందనీయమన్నారు. వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, వడదెబ్బ నివారణపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు రెడ్‌క్రాస్ కొనసాగిస్తున్న కృషిని అభినందించారు. ప్రజలకు అత్యవసర సమయాల్లో రక్తదానం చేస్తూ సేవలు అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ ఆంజనేయులు, కోశాధికారి కరిపె రవీందర్, టీఎన్‌జీవో అధ్యక్షుడు సుమన్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లాలో భారీగా ధాన్యం కొనుగోళ్లు

95శాతం వరకు సన్నరకమే..

జిల్లాలో ఈ సీజన్‌లో అత్యధికంగా సన్నరకం ధాన్యం కొనుగోలు చేశారు. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రకటన చేయడంతో రైతులు ఎదురు చూస్తున్నారు. కొనుగోలు చేసిన మొత్తం ధాన్యంలో 95శాతం వరకు సన్నరకమే ఉండటంతో ఎక్కువ మొత్తంలో చెల్లించాల్సి ఉంది. జిల్లాలో సరాసరి రూ.375 కోట్ల రూపాయల వరకు బోనస్ కింద చెల్లించాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తున్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా బోనస్ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు ఇబ్బందులు లేకుండా చేస్తున్నామని పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఎప్పుడు చేయని విధంగా ఈ సీజన్‌లో కొనుగోలు చేయడం వల్ల గోదాముల సమస్య ఏర్పడిందన్నారు. అన్ని మిల్లులకు అదనంగా కేటాయింపులు చేశామని ఆయన తెలిపారు. ఉన్న ధాన్యం నిల్వలను కూడా పది రోజుల్లో కొనుగోలు చేయడంతో పాటు తరలింపునకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

- జిల్లాలో ఇప్పటి వరకు 7లక్షల 57వేల 879 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- 95 శాతానికి పైగా సన్నరకాన్ని కొనుగోలు చేసిన అధికారులు
- అత్యధికంగా ధాన్యం కొనుగోళ్లతో నిండిపోయిన గోదాములు
- జిల్లాలో సన్నరకం ధాన్యం బోనస్ కోసం ఎదురు చూస్తున్న రైతులు

నిజామాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తున్నా.. పూర్తికావడం లేదు. జిల్లాలో ఇప్పటి వరకు 86వేల 222 మంది రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇంకా లక్షా మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనాల్సి ఉండటంతో అధికారులు ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో భారీ ఎత్తున కొనుగోలు చేయడంతో పాటు మిల్లులకు అదనంగా కేటాయించారు. ఇతర జిల్లాలకు తరలించేందుకు ఉన్నతాధికారులు అవకాశం ఇవ్వకపోవడంతో అధికారులు తిప్పలు పడుతున్నారు. మిలులు, గోదాములు నిండిపోవడంతో నిలువఉంచేందుకు ఇతర మార్గాలను అన్వేషిస్తున్నారు. రోజుల తరబడి రైతులు ధాన్యం నిల్వలను రోడ్లపైనే ఉంచడంతో కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

4లక్షల 15వేల ఎకరాల్లో వరి సాగు

జిల్లాలో ఈ సీజన్‌లో 4లక్షల 15వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. సుమారు 12లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశారు. మొత్తం దిగుబడిలో 8లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. 700 కొనుగోలు కేంద్రాల ద్వారా ఈ సీజన్‌లో ధాన్యాన్ని సేకరించారు. గత సీజన్‌లో 5లక్షల 30వేల మెట్రిక్ టన్నుల వరకు మాత్రమే ధాన్యాన్ని సేకరించారు. వాటిన్నింటిని అధిగమించి ఈ సీజన్‌లో మాత్రం ఇప్పటి వరకు 7లక్షల 57వేల 879 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. దీనిలో అత్యధికంగా సన్న రకం ధాన్యం 6లక్షల 86వేల 464 మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేశారు. దొడ్డురకం ధాన్యాన్ని 71వేల 415 మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేశారు. జిల్లాలో గతంలో ఎప్పుడూ ఇంత పెద్ద ఎత్తున ఏగ్రేడ్ కింద సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయలేదు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం సన్నరకం ధాన్యం కామన్ గ్రేడ్ కింద ఉంది. ప్రభుత్వం సన్నరకాలకు క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించడంతో ఈ సీజన్‌లో రైతులు వ్యాపారులకు అమ్మకాలను నిలిపివేసి మొత్తం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకే తీసుకు రావడంతో భారీగా కొన్నారు. జిల్లాలో అత్యధికంగా సన్నరకాలు కొనుగోలు చేయడం వల్ల దొడ్డురకం ధాన్యాన్ని కొన్నిచోట్ల మిల్లర్లు కొనుగోలు చేశారు. బోనస్ వస్తుందని నమ్మకంతో రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో ఉండి ధాన్యాన్ని అమ్మకాలు చేశారు. ఆర్మూర్, బాల్కొండ, మెండోరా, ఏర్గట్లతో పాటు మరికొన్ని మండలాల పరిధిలో ధాన్యం నిల్వలు ఉండటంతో వాటిని త్వరగా కొనుగోలు చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం రూ.1758 కోట్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 1351 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేశారు. మిగతా డబ్బులను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.



226 మిల్లులకు ధాన్యం కేటాయింపులు

జిల్లాలో ఈ సీజన్‌లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని 226 మిల్లులకు కేటాయింపులను చేశారు. ఈ మిల్లుల్లో గత సీజన్‌లో కొనుగోలు చేసిన నాల్గున్నర లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిలువ ఉంది. ఈ సీజన్‌లో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయడం వల్ల గోదాములు అన్ని నిండిపోయాయి. మిల్లుల్లో కూడా ఖాళీ లేదు. జిల్లాలో కేటాయించిన మిల్లులకు అదనంగా ధాన్యం కేటాయింపులను చేస్తున్నారు. జిల్లాలో గతంలో ఎప్పుడూ లేని విధంగా ధాన్యం కొనుగోలు చేయడంతో గోదాములు కరువు కావడంతో ఇతర జిల్లాలకు అనుమతులు ఇవ్వాలని కోరారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు ఇవ్వకపోవడంతో జిల్లాకు చెందిన అధికారులు ఉన్న మిల్లులకే అదనపు కేటాయింపులు చేస్తున్నారు. బాయిలర్ మిల్లులు 59కి ఎక్కువ మొత్తంలో కేటాయింపులను చేశారు. ఈ సీజన్‌లో జిల్లాలో అత్యధికంగా సన్నరకం ధాన్యమే కొనుగోలు చేయడం వల్ల బాయిలర్ మిల్లుల యజమానులు మొదట ఒప్పుకోలేదు. సన్నరకాలను బాయిల్డ్ చేస్తే ఎఫ్‌సీఐ తీసుకునే అవకాశం లేకపోవడంతో మిల్లర్లు కూడా కొన్ని చోట్ల అభ్యంతరాలను చెబుతున్నారు. ధాన్యం ఏ గ్రేడ్ కింద కొనుగోలు చేయడం వల్ల బాయిల్డ్ చేసేందుకు అవకాశం లేదు. బాయిల్డ్ చేసిన ధాన్యాన్ని ఎఫ్‌సీఐ తీసుకోకపోవడం వల్ల సమస్యలు వస్తాయని వారు భావిస్తున్నారు. అయినా జిల్లా అధికారులు ఇతర జిల్లాలకు అవకాశం ఇవ్వకపోవడంతో కొన్న ధాన్యాన్ని మొత్తం జిల్లాలో ఉన్న మిల్లులకు పెంచారు. భారీగా కేటా యింపులు చేస్తుండటంతో అన్ని మిల్లులు ఫుల్‌గా నిండిపోయాయి. చాలా మిల్లుల్లో ధాన్యం నిలువ చేసేందుకు అవకాశం లేకపోవడంతో కొన్ని చోట్ల ప్రైవేటు గోదాములను కూడా వాడుకుంటూ నిలువ చేస్తున్నారు. కొంతమంది మిల్లర్లు తాత్కాలిక షెడ్లు వేస్తూ నిలువ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మిగిలిన ధాన్యాన్ని కూడా ఈనెల 20లోపు కొనుగోలు పూర్తిచేయడంతో పాటు జిల్లాలోని మిల్లులకు కేటాయింపులు చేయనుండటంతో మిల్లర్లు కొన్ని చోట్ల ధాన్యాన్ని దించుకునేందుకు నిరాకరిస్తున్నారు. కొన్ని గ్రామాల పరిధిలో కొత్త రకం విత్తనాలు సాగు చేయడం అవి సన్నవి, దొడ్డివి కాక పోవడం వల్ల సమస్యలు వస్తున్నాయి. అధికారులు ధాన్యాన్ని కొనుగోలు చేసిన నిర్ణయించిన ప్రకారం బియ్యం వచ్చే అవకాశం లేకపోవడంతో మిల్లర్లు అభ్యంతరాలు చెబుతున్నారు.

టెక్స్‌టైల్స్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఏడాది ఏర్పాటు చేసిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్స్ టెక్నాలజీ కళాశాల హైదరాబాద్‌లో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి మూడు సంవత్సరాల డిప్లొమా ఇన్ హ్యాండ్‌లూమ్స్ టెక్నాలజీ కోర్సుకు ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని నిజామాబాద్ చేనేత, జౌళీశాఖ సహాయ సంచాలకుడు సాగర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఈ కళాశాలలో తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన విద్యార్థులకు 60 సీట్లు కేటాయించారని తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, ఇంటర్మీడియెట్ పూర్తయిన విద్యార్థులు వయస్సు జూలై 1, 2025 నాటికి జనరల్ కేటగిరిలో 15-23 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు ఎస్టీ కేటగిరిలో 15-25 సంవత్సరాలు నిండిన వారు అర్హులన్నారు. ఈనెల 24వ తేదీ ఉదయం 11గంటలకు చేనేత సహకార సంఘం నిజామాబాద్‌లో అవగాహన సదస్సు నిర్వహించనున్నామని ఆసక్తిగల అభ్యర్థులు ఈ సదస్సులో పాల్గొని తమ దరఖాస్తులను సమర్పించాలని ఆయన తెలిపారు.

నాగారం మైనార్టీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు


నిజామాబాద్ అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని నాగారంలోగల తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల జూనియర్ కళాశాల నిజామాబాద్-1లో ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ ఇంగ్లిష్ మీడియం గ్రూపులలో ఈ నెల 15 నుంచి 17 వరకు మిగిలి ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సయ్యద్ హైదర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లిం, క్రిస్టియన్, మైనార్టీ అభ్యర్థులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఎప్‌సెట్ ఎంట్రెన్స్ కోచింగ్‌తో పాటు నీట్, ఐఐటీ, జేఈఈ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు కంప్యూటర్ ల్యాబ్, స్టడీ మెటీరియల్ కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ కోర్సులు ఉన్నాయని ఇతర వివరాలకు 8985783112 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. అదే విధంగా ఎప్‌సెట్ 2025 ఫలితాలలో కళాశాలకు చెందిన విద్యార్థులు ఎండీ ముబాషీర్ ఇంజనీరింగ్ విభాగంలో 4371వ ర్యాంకు, జునైద్ ఖాన్ అగ్రికల్చర్ విభాగంలో 9102 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు.

మటన్ ముక్క గొంతులో ఇరుక్కొని ఒకరి మృతి



తారాసింగ్ (ఫైల్)

కోటగిరి, మే 12 (ఆంధ్రజ్యోతి): మటన్ ముక్క గొంతులో ఇరుక్కొని ఒకరు మృతి చెందిన ఘటన జిల్లాలో ఆదివారం రాత్రి జరిగింది. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం బొప్పాస్‌పల్లి గ్రామానికి చెందిన రుత్వాన్ తారాసింగ్ (53) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఓ శుభకార్యం నిమిత్తం ఆదివారం రాత్రి మండలంలోని సుద్దులం తండా గ్రామానికి తారాసింగ్ తన కుటుంబంతో కలిసి వచ్చాడు. బంధువులతో కలిసి భోజనం చేస్తుండగా.. ఒక్కసారిగా మటన్ ముక్క గొంతులో ఇరుక్కుంది. దీంతో వాంతులు చేసుకొని తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఆందోళనకు గురైన కుటుంబీకులు.. తారాసింగ్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య యమున బాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు.



సంస్థాగత మార్పులకు కాంగ్రెస్ కసరత్తు!

- గ్రామ, మండల నియోజకవర్గ స్థాయిలో కీలక నేతలకు పదవులు
- నిజామాబాద్ నగరంపై ప్రత్యేక దృష్టి పెట్టిన పార్టీకి చెందిన సీనియర్ నేతలు
- కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మున్నూరుకాపు, పద్మశాలీ నేతలకు అవకాశాలు
- పదవుల కోసం ఆశావహుల ముమ్మర ప్రయత్నాలు

నిజామాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఏఐసీసీ ఆదేశాల మేరకు జిల్లాలోని కాంగ్రెస్‌లో సంస్థాగత మార్పులకు పార్టీ నేతలు సిద్ధమవుతున్నారు. రాష్ట్రస్థాయిలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేయడంతో పాటు గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు కొత్త కమిటీలను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గాల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించిన పార్టీ నేతలు గ్రామ, మండల, జిల్లా స్థాయి నేతల అభిప్రాయాలను కూడగట్టారు. మండల సమావేశాలను నిర్వహించడంతో పాటు పూర్తిస్థాయి నివేదికను ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో సామాజిక సమీకరణాలను బట్టి కీలక వ్యక్తులకు, నేతలకు ఈ దఫా అవకాశాన్ని కల్పించనున్నారు. జిల్లాలో సమావేశాలకు హాజరైన పార్టీ ఇన్‌చార్జిలు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, కోట్నాక తిరుపతి పార్టీ నేతలకు నివేదిక అందించనున్నారు. ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాల పరిధిలో మరింత బలోపేతం కోసం దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. ఆయా నియోజకవర్గాల పరిధిలో గ్రామ, మండల కమిటీలలో కీలక నేతలకు అవకాశం ఇవ్వడంతో పాటు నియోజకవర్గంలో ఇన్‌చార్జిలతో పాటు ఇతర నేతలకు కూడా పదవులను ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బలమైన సామాజిక వర్గ నేతలకు అవకాశం ఇవ్వడంతో పాటు కమిటీలో అన్ని వర్గాలకు అవకాశం ఇచ్చే విధంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా ఇన్‌చార్జిలకు పదవుల కోసం పార్టీ నేతలు ఇప్పటికే లేఖలను అందించారు. సీనియర్ నేతలు ఎమ్మెల్యేలు, ఇతర నేతల ద్వారా ఆశావహులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. నిజామాబాద్ నగరాన్ని కీలకంగా తీసుకున్న పార్టీ అధిష్ఠానం ఈ దఫా మున్నూరుకాపు, పద్మశాలీ వర్గానికి అధిక ప్రాధాన్యం ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఆ వర్గం నేతలకు నగర అధ్యక్ష పదవితో పాటు ఇతర పదవులను కట్టబెట్టనుంది. కార్పొరేషన్ ఎన్నికలతో పాటు ఇతర ఎన్నికలపై దృష్టిపెట్టి డివిజన్ కమిటీలను కూడా భర్తీ చేయనున్నారు. ఇదే రీతిలో బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీల పరిధిలో ఆయా వర్గాలకు అవకాశాన్ని ఇవ్వనున్నారు. ఇప్పటికే ప్రాథమిక అంచనాకు వచ్చిన పార్టీ నేతలు కీలక నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. జిల్లాలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అన్ని సామాజిక వర్గాలకు అవకాశం ఇవ్వడంతో పాటు కీలక స్థానాలను సాధించే విధంగా కసరత్తు చేస్తున్నారు. బలమైన నేతలకు అవకాశం ఇవ్వడంతో పాటు ప్రతిపక్షాలను దీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్నారు. పార్టీ పరంగా సంస్థాగత మార్పులు చేపట్టి కొత్తవారికి ఈ దఫా అవకాశం ఇవ్వనున్నట్లు ఆ పార్టీకి చెందిన సీనియర్ నేతలు తెలిపారు. ఈ దఫా ఆయా సామాజిక వర్గం నేతలతో పాటు పార్టీలో దీర్ఘకాలికంగా పనిచేసిన సీనియర్ నేతలకు అవకాశం వస్తుందని వారు తెలిపారు.

గ్రంథాలయాలు.. ఆధునిక దేవాలయాలు

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



ఆన్‌లైన్ క్లాస్‌లను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, తదితరులు

బోధన్‌రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు.. ఆధునిక దేవాలయాలు అని, యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని పట్టుదలతో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని గ్రంథాలయంలో నిరుద్యోగ యువత కోసం కంప్యూటర్ విభాగాన్ని ఐదు కంప్యూటర్‌లతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు. గ్రంథాలయాల్లో కావాల్సిన పుస్తకాలను సమకూరుస్తామన్నారు. గత ప్రభుత్వం తప్పిదాల వల్లే నిరుద్యోగ యువతకు ఒక్క ఉద్యోగం కూడా రాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటి వరకు 60వేలకు ఉద్యోగాలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిందన్నారు. గ్రంథాలయానికి కావాల్సిన పరికరాల కోసం గ్రంథాలయా ల సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారని, ఆయన చేస్తున్న సేవలను ప్రశంసించారు. కంప్యూటర్‌ల ద్వారా విద్యార్థులు గ్రూప్-1, గ్రూప్-2 వంటి పరీక్షలకు సన్నద్ధం కావాలని, ఈ వసతులను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, కేశ వేణు, డీపీసీసీ డెలిగేట్ గంగా శంకర్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, పట్టణ అధ్యక్షుడు పాషా మొయినొద్దీన్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి..

ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని పలువిభాగాలను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలతో పాటు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం వైద్యులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. వైద్యులు సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రాహుల్ కుమార్, ఆర్ఎంవో డాక్టర్ అబ్దుల్ రహీం, డాక్టర్ సోఫీ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారికే ప్రభుత్వ సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు

ఆర్మూర్ రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): అర్హులైన వారికే ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాస్ సంక్షేమ పథకాలను అమలు చేయాలని నందిపేట మండల కాంగ్రెస్ నాయకుడు మంద మహిపాల్ అన్నారు. సోమవారం నందిపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు, అర్హులైన వారికి ఇందిరమ్మ కమిటి సభ్యులు జాబితా తయారు చేసి మండల అధికారులకు అందజేయాలన్నారు. ప్రభుత్వం అందించే ప్రతీ పథకం అర్హులకు అందేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దమ్మాయి శీను, జమీల్, కమ్మాల గంగాధర్, ఎర్రం లింగం, ప్రభుదాస్, కాంతం చిన్నయ్య, మాన్పూర్ భూమేష్, పోశెట్టి, సాగర్, నర్సయ్య, నిఖిల్, ఫిరోజ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మెండోర, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలో సావెల్ గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొని కశవత్రి గంగాధర్(46) మృతి చెందినట్లు ఎస్సై యాసిర్ అర్ఫత్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఏర్గట్ల మండలం దోంచంద గ్రామానికి చెందిన గంగాధర్ సావెల్ గ్రామంలో బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వచ్చి తిరిగి వెళ్లే క్రమంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో వెంటనే మరో వాహనంలో ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. మృతుడు వారం రోజుల క్రితం గల్ఫ్‌దేశం నుంచి వచ్చాడు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. శుభకార్యానికి వచ్చి సమీపబంధువు మృతిచెందడంతో సావెల్ గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

సుద్దులంలో గడ్డివాము దగ్ధం

కోటగిరి,మే12(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలం సుద్దులం గ్రామంలో ఆదివారం రాత్రి తోట శివకుమార్ అనే రైతుకు చెందిన గడ్డివాము దగ్ధమైంది. ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పు అంటించడంతో సుమారు 500గడ్డి మోపులు కాలిపోయాయి. మంటలు పక్కనే ఉన్న పశువుల పాక వరకు వ్యాపించడంతో గమనించిన స్థానికులు స్పందించి గేదెలను వదిలివేశారు. దీంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి వేశారు.

మూఢ విశ్వాసాలను విశ్వసించొద్దు

కోటగిరి,మే12(ఆంధ్రజ్యోతి):మూఢ విశ్వాసాలను విశ్వసించొద్దని రుద్రూరు ఎస్సై సాయన్న సూచించారు.రుద్రూరు మండలంలోని రాయకూర్ గ్రామంలో సోమవారం సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.రోడ్డు భద్రతపై అవగాహన, మహిళల రక్షణ కోసం అత్యవసర పరిస్థితుల్లో సేవల నిమిత్తం గ్రామ భద్రత,ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు నాటికలు,పాటల రూపంలో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

రెంజల్,మే12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో ఆదివారం రాత్రి ఎస్సై చంద్రమోహన్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. సాటాపూర్ గ్రామానికి చెందిన సద్దాంకు మూడు రోజుల జైలుశిక్ష, లంగ్దాపూర్ గ్రామానికి చెందిన దండం లింగంకు రెండు రోజుల జైలుశిక్ష, బెల్‌గావ్ గ్రామానికి చెందిన షేక్.రెహమన్, తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన నవీన్‌కు ఒకరోజు జైలుశిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ న్యాయాధికారి శేషతల్ప సాయి తీర్పు వెల్లడించినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మండలంలో ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టప్రకారం శిక్షకు అర్హులన్నారు.

వ్యవసాయానికి అనుబంధంగా జీవాల పెంపకం చేపట్టాలి

● జిల్లా పశువైద్య పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రోహిత్‌రెడ్డి



మాట్లాడుతున్న వేల్పూర్ ఏఎంసీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి

బాల్కొండ, మే 12(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయానికి అనుబంధంగా జీవాల పెంపకం చేపట్టి అదనపు ఆదాయం పొందాలని జిల్లా పశువైద్య పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎం. రోహిత్‌రెడ్డి అన్నారు. బాల్కొండ మండలం వన్నెల్ బి లో సోమవారం రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జీవాల పెంపకానికి కోటి రూపాలయ వరకు రుణాన్ని అందజేస్తుందని ఇందులో 50 శాతం సబ్సిడీ కల్పిస్తుందన్నారు. దేశీకోళ్ల పెంపకం, గొర్రెలు, మేకలు ఆవుల పంపకాన్ని పరిశ్రమగా మలుచుకోవాలన్నారు. వేల్పూర్ ఏఎంసీ చైర్మన్ ముత్యంరెడ్డి మాట్లాడుతూ రైతులు వ్యవసాయ శస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు పొందాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త క్రిష్ణచైతన్య మాట్లాడుతూ పంటల సాగులో యూరియా రసాయనిక మందులను మోతాదుమేరకే వాడి సాగు ఖర్చు తగ్గించుకోవాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రశీదులను తప్పనిసరిగా భద్రపర్చుకోవాలని రైతులకు సూచించారు. పంటమార్పిడి విదానం ద్వారా అధిక దిగుబడులతో పాటు ఆదాయం కూడా లభిస్తుందన్నారు. సాగునీటిని ఆదా చేయడానికి ప్రతీరైతు కృషి చేయాలని కోరారు. అదేవిదంగా వ్యవసాయ క్షేత్రాలలో చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ ఏఎంసీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, ఏవో లావణ్య, హెచ్‌వో వినాయక్, డాక్టర్ ప్రభాకర్, ఏఈవోలు నిహారిక, రేష్మ, ఏఎంసీ డైరెక్టర్, రైతులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ది దోపిడీ పాలన.. మాది ప్రజాపాలన

● బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్



మోర్తాడ్‌లో మాట్లాడుతున్న ముత్యాల సునీల్‌కుమార్

మోర్తాడ్,మే 12(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలన దోపిడీ అవినీతి పాలన కాగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డిది ప్రజాపాలన అని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ అన్నారు.మోర్తాడ్‌లోని ప్రజానిలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సునీల్‌కుమార్ మాట్లాడారు. బాల్కొండ నియోజకవర్గంలో టీఆర్‌ఎస్ హాయాంలో అవినీతి, దోపిడి తాండవించిందని నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పాలనలో కమిషన్లు అవినీతి ప్రజలకు తెలుసని సునీల్‌కుమార్ అన్నారు.ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఏమిపాలుపోక కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని పచ్చకామెర్ల వ్యక్తికి అంత పచ్చగా కన్పించినట్లు అవినీతి పరుడైన ప్రశాంత్‌రెడ్డి అంత అవినీతే కన్పిస్తుందని సునీల్‌కుమార్ ఎద్దేవా చేశారు.ఇందిరమ్మ కమిటీల ద్వారా లబ్ధిదారుల ఎంపిక ప్రభుత్వ జీవో ప్రకారమే జరుగుతుందని అన్నారు. గతంలో డబుల్ బెడ్ ఇండ్లను రూ.50 వేల నుంచి లక్ష రూపాయల వరకు అమ్ముకున్నారని సునీల్‌కుమార్ ఆరోపించారు. ప్రజాపాలనలో పారదర్శకంగా అర్హులైన వారిని అధికారులు ఎంపిక చేస్తారని అన్నారు. సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మీ లబ్ధిదారుల నుండి కూడా డబ్బులు వసూలు చేసిన చరిత్ర బీఆర్‌ఎస్ దే అన్నారు. పోలీస్ స్టేషన్‌లో, రెవెన్యూ కార్యాలయాలు, పార్టీ కార్యాలయాలుగా చేసిన ఘనత ప్రశాంత్‌రెడ్డిదేనని అన్నారు. వరికొనుగోలు కేంద్రాలు సజావుగా నడుస్తున్నాయని ప్రభుత్వం మహిళ సంఘాలకు ఇవ్వడం వల్ల నిజాయితీగా పనులు జరుగుతున్నాయని అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో వరికొనుగోలు కేంద్రాలలో 4 నుంచి 5 కిలోల కడ్త రైతుల నుంచి వసూలు చేసి ఎమ్మెల్యేలు పంచుకున్నారని సునీల్‌కుమార్ ఆరోపించారు. ప్రజా పాలనలో అన్ని సంక్షేమ పథకాలు అధికారుల సమన్వయంతో నిజమైన లబ్ధిదారులకు అందుతున్నాయని అన్నారు.ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి దోపిడి అవినీతి ఎక్కడ బయటపడుతుందోనని కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని సునీల్‌కుమార్ ధ్వజమెత్తారు. సమావేశంలో డీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు పాలెపు నర్సయ్య, ముత్యాల రాములు, పాలెపు నర్సయ్య, సోద దేవారెడ్డి, మహిపాల్, తీగెల సంతోష్, గురువయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.

నిద్రిస్తున్న మహిళ మెడలోంచి బంగారు గొలుసు చోరీ

ఎడపల్లి, మే12(ఆంధ్రజ్యోతి):ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామంలో ఆదివారం రాత్రి నిద్రిస్తున్న మహిళ మెడలో నుండి పుస్తెల తాడును గుర్తు తెలియని దొంగలు ఎత్తు కెళ్లిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన మంగళి రవి కుటుంబ సభ్యులు వేసవి కాలం దృష్ట్యా ఇంటికి తాళం వేసి ఆరు బయట పడుకున్నారు. వారు గాఢ నిద్రలో ఉన్న సమయంలో మంగళి రవి భార్య మెడలోని రెండు తులాల బంగారు గొలుసును కత్తిరించుకుని పారిపోతున్న సమయంలో బాధితురాలు, కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో దొంగ పారి పోయాడని మంగళి రవి తెలిపారు. అనంతరం బాధితుడు సోమవారం ఉదయం ఎడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

తెలుగుదేశం పార్టీ మండల కమిటీల నియామకం



ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,మే12(ఆంధ్రజ్యోతి): బోధన్‌లో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గంలోని బోధన్ పట్టణంతో పాటు మండలం, సాలూర, రెంజల్ మండలాల కమిటీలను నూతనంగా నియమించడం జరిగిందని అడహక్ కమిటీ సభ్యులు కోట గోపాల్ రెడ్డి, పావులూరి వెంకటేశ్వర్ రావు, సీహెచ్ వీ హన్మంత్ రావు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ పార్టీ పునర్ నిర్మాణ చర్యల్లో భాగంగా సామాజిక, సమానత్వాన్ని చురుకైన కార్యకలాపాలను ప్రోత్సహించేలా పార్టీని గ్రామస్థాయి నుండి బలోపేతం చేయడం యువతకు నాయకత్వ అవకాశాలు కల్పించడం, పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ కమిటీలు నియామకం చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం నూతన కమిటీలచే ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ నియోజకవర్గ సీనియర్ నాయకులు అమర్‌నాథ్ బాబు తిరిగి టీడీపీలో చేరడం జరిగిందని పేర్కొన్నారు. బోధన్ మండల అధ్యక్షులుగా బడూరి కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా యార్లగడ్డ ఈశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శిగా రాచగల్లా హన్మంత్ రావు, పట్టణ అధ్యక్షులుగా ముప్పాల గంగాధర్ రావు, ఉపాధ్యక్షులు సూరబత్తుని శ్రీనివాస్ రావు, దంతం వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా సుబ్బారావు, సాలూర మండల అధ్యక్షుడిగా కర్నాటి రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా బొల్లెపల్లి శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శిగా చీల ప్రకాష్, రెంజల్ మండల అధ్యక్షుడిగా కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి యుసుఫ్ బేగ్‌లతో పాటు కార్యనిర్వాహణ కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారులను నియమించడం జరిగిందన్నారు. పార్టీ అభివృద్ధి కోసం అందరు సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కృష్ణా రెడ్డి, సచిన్ పటేల్, హన్మంత్ రావు, బాల గంగాధర్ రావు, రామకృష్ణ, సూరబత్తుని శ్రీనివాస్ రావు, గోవింద్ రావు, యుసుఫ్ బేగ్, విఠల్ పటేల్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను సర్వే చేసిన కలెక్టర్



వర్నిలో సర్వేచేస్తున్న సబ్‌కలెక్టర్

వర్ని,మే12(ఆంధ్రజ్యోతి): వర్ని మండలంలోని పొట్టిగుట్ట తండాను సోమవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సందర్శించారు. లబ్ధిదారులతో మాట్లాడి సర్వే నిర్వహించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారులకు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మారుతి, కార్యదర్శి మస్తాక్ హుస్సేన్ పాల్గొన్నారు.

● సర్వేను పరిశీలించిన సబ్‌కలెక్టర్

కోటగిరి:పోతంగల్ మండలంలోని జల్లాపల్లి, కల్లూర్ గ్రామాలలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పరిశీలించారు. సర్వేను పకడ్బందిగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారికే కేటాయించాలని,ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్దిదారుల ఎంపిక చేపట్టాలని సూచించారు.అనర్హులకు కేటాయిస్తేచర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీవో చందర్, ఎంఈవో శంకర్, వ్యవసాయ అధికారి నిశిత,పంచాయతీ కార్యదర్శులు రాజలింగం,ప్రతాప్ తదితరులున్నారు.

వేల్పూర్‌లో మదర్సా పాఠశాలపై అధికారులకు ఫిర్యాదు



ఆర్‌ఐకి వినతిపత్రం అందజేస్తున్న హిందూ యువజన సంఘాల నాయకులు

వేల్పూర్, మే 12(ఆంధ్రజ్యోతి): వేల్పూర్‌లో ఉన్న మదర్సా పాఠశాలపై సోమవారం స్థానిక హిందూ యువజన సంఘాల నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మదర్సా స్కూల్ ఎలాంటి పర్మిషన్‌లు లేకుండా నడుపుతున్నారని ఈ విషయంలో ఎంఈవో, డీఈవోలు పర్మిషన్ ఇచ్చినట్లయితే దానికి సంబంధించిన పత్రాలను తమకు ఇవ్వాలని సమాచార హక్కు చట్టం కింద మెమోరాండం అందజేశారు. దేశవ్యాప్తంగా మదర్సా స్కూల్‌లను తీసివే స్తున్నారని అదే విధంగా వేల్పూర్‌లో ఉన్న మదర్సా స్కూల్‌ను కూడా తీసివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భజరంగ్‌దళ్ యూత్ అధ్యక్షుడు సుధాకర్, కమలేష్, యువజన సంఘాల నాయకులు నర్సారెడ్డి, అన్వేష్, శ్రీకాంత్, సృజన్ పాల్గొన్నారు.

పడిగెలలో గంగమ్మ కల్యాణ మహోత్సవం

వేల్పూర్,మే12(ఆంధ్రజ్యోతి):మండలం పడిగెలలో గంగపుత్ర సం ఘం ఆధ్వర్యంలో సోమవారం గంగమ్మ ఆలయంలో గంగమ్మ కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అంతకుముందు గంగపుత్రులు వలగొడుగుతో మంగళ హారతులతో శోభాయాత్ర నిర్వహించారు. ఆలయంలో ఉదయం అభిషేకం,అర్చణ,పున్యవచనం,హోమం అట్టి కార్యక్రమాలను నిర్వహించారు.ఈకార్యక్రమంలో గంగపుత్ర సంఘం సభ్యులుపాల్గొన్నారు.

బంజారా నాయకుల కొవ్వొత్తుల ర్యాలీ

ఆర్మూర్‌టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బంజారా నాయకుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. భారత్, పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్దంలో మురళినాయక్ వీర మరణం పొందాడని దేశానికి స్వరాజ్యం రాకముందునుంచి మురళి నాయక్ కొరకు దేశం ధర్మం కోసం బంజారుల పాత్ర కీలకమైనదని వెనుకడుగు వేయడం తెలియనివారమని అన్నారు. మురళీ నాయక్ కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన ఆత్మకు శాంతి కలు గాలని ప్రార్థిస్తు ఘనంగా నివాలులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గార్డెన్ రాజునాయక్, కేలోత్ పిర్సింగ్ నాయక్, బి. శీనునాయక్, కే. గంగాధర్, గజల్‌లాల్,బాల్‌రాం, సంతోష్, గంగాధర్, విఠల్, మోహన్, గణేష్, రవీందర్, బాలాజీ, గోనియా తదితరులు పాల్గొన్నారు.

'నేను సైతం దేశం కోసం'

ఆర్మూర్‌టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లోని నాగలింగేశ్వర ఆలయంలో నేనుసైతం దేశంకోసం అంటూ ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. దేశంకోసం విధులు నిర్వహిస్తున్న సైనికులకు, రక్షణశాఖ అధికారులకు, ప్రధాన మోదీకి మరింత శక్తిని ఇవ్వాలని ఉగ్రవాదాన్ని అనిచివేయడానికి భారత సైనికులు విజ యం సాధించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, ఆలయ కమిటీ ప్రతినిధులు అంబిక రమేష్, రాజయ్య, అజయ్, నారాయణ, సంఘ సభ్యులు సడాక్ మోహన్, సడాక్ గంగాధర్, పుప్పల రాజేందర్, కుకునూర్ లింగన్న, పొడలేని బాజన్న, తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా సమ్మెను విజయవంతం చేయాలి

భీమ్‌గల్, మే 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 20న చేపట్టే దేశవ్యాప్త సమ్మెలో ప్రతీ కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు పిలుపు నిచ్చారు. ఈ మేరకు సోమవారం భీమ్‌గల్ మున్సిపల్ కార్యాలయంలో కార్మికులతో సమావేశం నిర్వహించి గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ పోరాడి సా ధించుకున్న హక్కులను కాలరాయటంతో పాటు ప్రజలపైన భారాలు మోసే పద్దతుల్లో ధరలను విపరీతంగా పెంచి అన్ని వర్గాల ప్రజలపైన ఆర్థిక భారాలు మోపుతున్నారని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుగున్నారని కార్మిక వర్గం ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న 29 చట్టాలను మార్చి నాలుగు కోడ్‌లు విభజించారని వీటి మూలంగా కార్మికులు హక్కులు వదించబడుతాయని తమ హక్కుల సాధన కోసం దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపు నివ్వడం జరిగిందన్నారు. సమ్మెలో ప్రతీఒక్క కార్మికుడు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం మున్సిపల్ కమీషనర్ గంగాధర్‌కు సమ్మె నోటీసును అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, సీఐటీయు మండల అధ్యక్షుడు ఓంకార్, కార్యదర్శి నవీన్, సాయవ్వ, పోశయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : రుద్రూరు మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం సమ్మె వాల్ పోస్టర్లను సీఐటీయూ నాయకులు నన్నేసాబ్ ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక చట్టాలను బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదిన తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకురాలు గంగామణి, ఆశా యూనియన్ నాయకులు భూలక్ష్మి, వాణి, లత, పుష్ప తదితరులున్నారు.

బీజేపీ కమ్మర్‌పల్లి మండల కార్యవర్గం

కమ్మర్‌పల్లి, మే 12: (ఆంధ్రజ్యోతి) మండల భారతీయజనతాపార్టీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎంపీ ధర్మపురి అర్వింద్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లికార్జున్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు దినేష్ కులచారి ప్రకటించినట్లు కమ్మర్‌పల్లి మండల పార్టీ అధ్యక్షుడు బద్దం రమేష్ రెడ్డి తెలిపారు. ప్రధాన కార్యదర్శులుగా సోమ నరేష్ (ఉప్లూర్) సున్నవడ్ల తిరుపతి (కమ్మర్‌పల్లి), ఉపాధ్యక్షులుగా సతీష్ (హాసాకొత్తూర్), ఎలాల వెంకట్ రెడ్డి (చౌట్‌పల్లి), వర్ల సంజన రాజేష్ (అమీర్‌నగర్), లక్ష్మీ గంగాధర్ (నర్సాపూర్) కార్యదర్శులుగా ఆల్గోట్ బలరాం (కమ్మర్‌పల్లి), ప్రశాంత్ (కోనాసముందర్).రవి (ఇనాయత్‌నగర్), భాస్కర్ (కోనాపూర్) కార్యవర్గ సభ్యులుగా మద్దం స్వప్న, ఊట్పూర్ శివకుమార్, పసుపుల చంద్రమోహన్, శ్రీరాముల శ్రావన్, సంతోష్, సక్కురం నర్సయ్య, వంశి, లఖ్మరాజేస్, గణేష్, బానోత్ ప్రశాంత్ ఎన్నికయ్యారు.

గణేష్ ఆలయ 12వ వార్షికోత్సవం

ఎడపల్లి, మే12(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని పెద్ద చెరువు కట్టమీద స్వయంభుగా వెలసిన గణేష్ మందిర 12వ వార్షికోత్సవ వేడుకలను గ్రామస్థులు సోమవారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు తదితరులు ఉన్నారు.

గౌతమ బుద్ధుని జయంతి

ఆర్మూర్ రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని ప్రసిద్ధ సిద్దుల గుట్టపై నిర్మించిన శ్రీనవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన్య మందిరంలో సోమవారం బుద్ధ పౌర్ణిమ సందర్భంగా గౌతమిబుద్ధుని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైనా ధ్యానులు అఖండ ధాన్యం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లా డుతూ ప్రతీ ఒక్కరు గౌతమ బుద్ధుడు చెప్పిన మార్గంలో నడవాలని, సమాజా నికి గౌతమబుద్ధుడు ఆదర్శప్రాయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఎస్ఎన్ జిల్లా అధ్యక్షుడు సాయిక్రిష్ణారెడ్డి, గొడ్డు దయానంద్, సాయినాథ్, సుదర్శన్, భూమన్న, మైలారం రాజు, ప్రశాంత్‌రెడ్డి, ధ్యానులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండలంలోని తిమ్మాపూర్‌లో మోక్షనంద బుద్ధవిహార్‌లో 2569వ బుద్ధపౌర్ణమి వేడుకలు ఘనంగా సోమవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో బుద్ధుడి విగ్రహానికి పుష్పాంజలి, ధాన్యం, పతాక ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో ప్రజలనుద్దేశించి బంతి దమ్మ రక్షిత మాట్లాడుతూ బుద్ద పౌర్ణమి ప్రాముఖ్యతను వివరించారు. మహామాయ సిద్దార్థ గౌతమునకు వైశాక పౌర్ణమి రోజున జన్మనిచ్చిం దని తెలిపారు. జ్ఞానోదయుడైన బుద్ధుడు నాలుగు ఘన సత్యాలను కనుగొన్న గొప్ప దినమని అన్నారు. భగవాన్ బుద్ధుడు 80 ఏళ్ల వయ సు వరకు దమ్మ బోధన చేస్తు మహపరి నిర్వాణం పొందిన వైశాఖ పౌర్ణమి నాడేనని అన్నారు. ప్రపంచ బౌద్దులకు అత్యంత పవిత్రమైన దినమని వివరించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్విసెస్ జడ్జ్ ఉదయ్‌భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అల్జాపూర్ గోదావరిలో వ్యక్తి మృతదేహం లభ్యం

నవీపేట,మే12(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచ పంచాయతీ పరిధిలోని అల్జాపూర్ శివారులోని గోదావరి నదిలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్ఐ వినయ్ తెలిపారు. మృతుడికి సుమారు 45నుండి 50సంవత్సరాల మధ్యన వయసు ఉంటుందని అతడు మృతి చెంది సుమారు మూడు నుంచి నాలుగు రోజుల మధ్యన అయిఉంటుందని భావిస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడి కాలికి వల చుట్టుకుని ఉందని అతడి ఒంటిపైన కేవలం డ్రాయర్ మాత్రమే ఉందని అన్నారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నర్సాపూర్‌లో సీసీ రోడ్డుపనులు ప్రారంభం

కమ్మర్‌పల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సాపూర్ గ్రామంలో సీసీరోడ్డు పనులను కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పాలెపు నర్సయ్య, టీపీసీసీ అధికార ప్రతినిధి బాసవేణుగోపాల్ యాదవ్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. తమ గ్రామానికిచెందిన యాదవ కాలనీలో నిధులు ఇపిప్పంచినందుకు మంత్రి సీతక్కకు గ్రామస్తులు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

సాంగ్లీ వ్యవసాయ మార్కెట్ కమిటీ సందర్శన



ధాన్యాన్ని పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

కోటగిరి, మే 12 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని సాంగ్లీ వ్యవసాయ మార్కెట్ కమిటీని సోమవారం కోటగిరి మార్కెట్ కమిటీ పాలకవర్గం సందర్శించింది. ఏఎంసీ చైర్మన్ హన్మంతు ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు, సిబ్బంది మార్కెట్ కమిటీ పనితీరుపై అధ్యయనం చేశారు. సాంగ్లీ మార్కెట్ కమిటీలో పసుపు, బెల్లం, చెరకు, మిర్చి, ద్రాక్ష ఇతర పంటల క్రయ, విక్రయాలను అధ్యయనం చేశారు. కార్యక్రమంలో విండో ఉపాధ్యక్షులు అనిల్, విండో అధ్యక్షులు సిద్దు, డైరెక్టర్ జగన్నాథ్ రావు, సాయిలు పాల్గొన్నారు.

వేల్పూర్‌లో నూతన తహసీల్దార్‌కు సన్మానం

వేల్పూర్, మే 12(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్‌ను సోమవారం మండలంలోని రేషన్‌షాపు డీలర్లు, మండల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శాలువ, పుష్పగుచ్చంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు కాంతరావు, కార్యదర్శి భూమేశ్వర్, డీలర్లు బాస గంగాధర్, తాళ్ల రాజన్న, శేఖర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రవికాంత్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యంచలో పుష్కర ఘాట్ నిర్మించాలని వినతి

నవీపేట,మే12(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచలో గోదావరి నది ఒడ్డున పుష్కర ఘాట్ నిర్మించాలని పలువురు గ్రామస్థులు సోమవారం అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో వారు ఈ వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో జిల్లాలోని గోదావరి నది ఒడ్డున ఉన్న చాలా గ్రామాలలో పుష్కర ఘాట్‌లను నిర్మించారని, ప్రధాన రహదారి పక్కన ఉన్న యంచలో పుష్కర ఘాట్ నిర్మించకపోవడంతో భక్తులు అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు.

● బ్రిడ్జికి ఇరువైపులా రక్షణ గోడ నిర్మించాలి

మండలంలోని యంచ గోదావరి నదిపై ఉన్న రోడ్డు బ్రిడ్జికి ఇరువైపులా ఆరు పీట్ల ఎత్తుతో రక్షణ గోడ నిర్మించాలని యంచ గ్రామస్తులు కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ప్రజావాణిలో వారు కలెక్టర్‌ను కలిశారు. ప్రస్తుతం బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న బారికేడ్లు చాలా తక్కువ ఎత్తులో ఉండడంతో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన కొందరు బ్రిడ్జిపై నుండి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడుతున్నారని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్, బాపు రావు, మోహన్, చందరి ప్రవీణ్, లక్ష్మిపతి తదితరులున్నారు.

మద్యానికి బానిసై యాసిడ్ తాగి వ్యక్తి ఆత్మహత్య

కామారెడ్డి టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై ఒకరు యాసిడ్‌తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి సోమ వా రం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డి పట్ట ణం లోని వాంబే కాలనీకి చెందిన జోగ్రిగల ఓంప్రకాష్(51) గుమాస్తాగా పనిచేస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసై చేసిన అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తి చెంది యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసు పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ఓంప్రకాష్ మృతిచెందినట్లు సీఐ తెలిపారు.

● ఉరివేసుకుని మహిళ..

కామారెడ్డి విద్యానగర్‌కు చెందిన మంగళి శ్రీవిద్య తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం శ్రీవిద్య భర్తతో విడిగా ఉంటూ తన సోదరి శ్రీమతితో కలిసి నివసిస్తుంది. గత కొంత కాలం గా చెడువ్యసనాలకు బానిసైందని, తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. మృతురాలి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వ్యక్తి..

దోమకొండ : కడుపునొప్పి భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఏఎస్సై జానీబాషా తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉసికే లక్ష్మణ్ (45) అనే వ్యక్తి గత కొన్ని సంవత్సరాలుగా కడుపునొప్పితో బాధపడుతూ ఉన్నాడు. దీంతో ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లిపోయి దోమకొండ శివారులోని కుడి చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మృతుని భార్య భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

రెంజల్,మే12(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు అధికమవుతున్న తరుణంలో ప్రతి ఒక్కరు సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ చంద్రమోహన్ అన్నారు. సోమవారం మండలంలోని సాటాపూర్ గ్రామంలో ప్రజలకు సైబర్ క్రైమ్, ట్రాఫిక్ చట్టాలపై అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బందితో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి గ్రామ చౌరస్తా వద్ద ప్రజలకు సైబర్ క్రైమ్, ట్రాఫిక్ చట్టాలపైన అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు చట్టాలు తెలుసుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని, సోషల్ మీడియా యుగంలో సైబర్ క్రైమ్‌లు అధికమవుతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ సైబర్‌క్రైమ్‌పై అవగాహన కలిగి ఉండాలని, ఏదైనా తప్పుడు కాల్స్ వస్తే పోలీసులకు సమాచారం అందించాలని అలాగే పోలీసులను సంప్రదించాలన్నారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుళ్లు శంకర్, సునీత, కానిస్టేబుళ్లు శంకర్ రెడ్డి, ఒడ్డెన్న పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం(ఫైల్)

పచ్చి రొట్ట.. పంటకు రక్ష

● రసాయనాల వాడకం తగ్గించేందుకు ప్రత్యామ్నాయం

● రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు

కోటగిరి, మే 12 (ఆంధ్రజ్యోతి): అధిక దిగుబడులే లక్ష్యంగా పంటల సాగులో విచ్చల విడిగా రసాయన ఎరువుల వినియోగం హానికరమని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. వీటితో భూసారం దెబ్బతింటుందని వివరించే ప్రయత్నం చేస్తున్నారు. క్రమంగా పంటలు సూక్ష్మ, స్థూల పోషకాలు లోపిస్తాయని హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో భూసారం పెంచుకునేందుకు ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్ట సాగు చేసి పంటలను కాపాడుకోవాలని సూచించారు.

● సాగుకు ముందు

జీలుగ, జనుము, పెసర, పిల్లి పెసర వంటివి ప్రధాన పంటల సాగుకు ముందు పొలంలో పండించి తర్వాత కలియ దున్నడం ద్వారా మేలు జరుగుతుందని వ్యవసాయ అధికారులు వివరిస్తున్నారు. ఫలితంగా రసాయన ఎరువులు తగ్గడంతో పాటు వాటి కోసం అయ్యే ఖర్చు పంట నాణ్యత ఇలా ఎన్నో లాభాలు పొందవచ్చని వివరిస్తున్నారు.

● నత్రజని, భాస్వరం పుష్కలం

జీలుగ, జనుము, పెసర, పిల్లి పెసర సాగు మొగ్గ దశ వరకు పెంచాలి. ఆ తర్వాత భూమిలో కలియ దున్నాలి. సాధారణంగా ఇవి పూత దశకు రావడానికి 40నుంచి 50రోజుల సమయం పడుతుంది. ఇది లెగ్యుం జాతికి చెందినవి కావడంతో నత్రజని స్థాపనకు ఎంతగానో తోడ్పడుతున్నాయి. వీటితో పంటకు అవసరమైన నత్రజని, భాస్వరం లభిస్తుంది. దీంతో రసాయన ఎరువులు, యూరియా, డీపీఏ వాడకం తగ్గుతుంది. సాధారణంగా మే, జూన్ నెలలో దుక్కిని దున్ని విత్తనాలను చల్లుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వ్యవసాయ అధికారులు అందుకు తగిన సలహాలు, సూచనలు అందిస్తున్నారు. పచ్చిరొట్టతో ప్రయోజనం పొందాలని సూచిస్తున్నారు.

● ఉమ్మడి మండలానికి 140క్వింటాళ్ల జీలుగ

కోటగిరి, పొతంగల్ మండలాల్లో రైతులకు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి రాజు, నిశితలు తెలిపారు. కోటగిరి మండలంలోని కొత్తపల్లిలో 30క్వింటాలు, కోటగిరిలో 30క్వింటాలు, ఎత్తొండలో 15క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. పొతంగల్ మండలంలో సొసైటీ పరిధిలో 50క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఒక్క హెక్టారుకు ఒక బ్యాగు చొప్పున రైతులకు అందిస్తామన్నారు. సబ్సిడీ పోనూ బ్యాగు ధర 2160రూపాయలు ఉంటుందని తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తామని వ్యవసాయ అధికారులు తెలిపారు.

● అధిక దిగుబడి: రాజు, వ్యవసాయ అధికారి, కోటగిరి



పచ్చిరొట్ట సాగుతో భూమి సారవంతంగా అవుతుంది. సాగు చేసిన పంటలకు సేంద్రీయ ఎరువులతో పాటు నత్రజని అందిస్తుంది. దీంతో పంటలు సంపూర్ణ ఆరోగ్యంగా ఎదిగి అధిక దిగుబడులు వస్తాయి. రసాయన ఎరువుల వాడకం, వాటి కోసం అయ్యే ఖర్చు తగ్గుతుంది.

వేంకటేశ్వర ఆలయంలో స్వామివారి పల్లకీ సేవ ఊరేగింపు


మెండోర ఆలయంలో పల్లకిలో ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

మెండోర, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి పల్లకీ సేవను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పౌర్ణమి రోజు పురస్కరించుకుని స్వామి ఉత్సవ మూర్తులను గోవింద నామాలతో ఆలయం చుట్టూ ఊరేగించారు. పల్లకి సేవముందు మహిళలు మంగళ హారతులతో భక్తులు ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదాన సత్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ కాలనీలలో అధ్వానంగా మారిన రహదారులు ఇలా

ఆంధ్రజ్యోతి ఫోకస్

15 ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోరా?

● ఇందల్వాయి మండలంలో అభివృద్ధికి నోచుకోని ఇందిరమ్మ కాలనీలు ● కనిపించని డ్రైనేజీలు, సీసీ రోడ్లు

ఇందల్వాయి, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇళ్లులేని నిరుపేదలకు ఉచితంగా మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల కాలనీలను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో ఇందిరమ్మ కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీరు, విద్యుత్ దీపాలు లేక అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. ఏం చేయాలో తెలియక కాలనీవాసుల్లో గందరగోళం నెలకొంది. ఇందిరమ్మ ఇళ్లను కేటాయించి 15 ఏళ్లు గడిచినా పట్టింపు లేకుండా పోయింది. మండలంలోని నల్లవెల్లి, సిర్నాపల్లి తదితర గ్రామాలు ఇందిరమ్మ ఇళ్లను వైఎస్ఆర్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు కేటాయించారు. ఇంటిస్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించారు. 15 ఏళ్లు గడుస్తున్నా మౌలిక వసతులు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, విద్యుత్ దీపాలు, తాగునీటి వసతి కల్పించడంలో అధికారులు విఫలం చెందారని ఇందిరమ్మ కాలనీ వాసులను అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. సిర్నాపల్లి, నల్లవెల్లి గ్రామాల్లోని పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నా ఇందిరమ్మ కాలనీలను మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు ఓట్ల కోసం కాలనీలో ప్రతీ ఇళ్లకు తిరుగుతూ అభివృద్ధి చేస్తామని చెబుతూ తీరా ఎన్నికల్లో గెలిచాక మర్చిపోతున్నారని అన్నారు. ఇందిరమ్మ కాలనీ వాసులపై ఎందుకింత నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

సిర్నాపల్లిలో..

మండలంలోని సిర్నాపల్లి గ్రామంలో 2006లో అప్పటి ప్రభుత్వం 70 కుటుంబాలకు ఇంటి స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇచ్చారు. 15 ఏళ్లు గడిచిన ఇప్పటి వరకు ఇంటి నెంబర్ కేటాయించలేదు. ఇంటి పన్నులు, ఇతర పన్నులు కట్టడానికి కాలనీవాసులు సిద్ధంగా ఉన్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

నల్లవెల్లిలో..

మండలంలోని నల్లవెల్లి గ్రామంలో దాదాపు 20 కుటుంబాలు ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్నాయి. 15 ఏళ్లు పూర్తయినా సీసీ రోడ్లు, డ్రైనేజీ మాత్రం చేపట్టలేదు. ప్రతియేడాది ఇంటి పన్నులు కడుతున్నా అభివృద్ధి చే యడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ ఏర్పాట్లు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వర్షాకాలం అధ్వానం

వర్షాకాలం వచ్చిందంటే చాలు చిరుజల్లులకే రోడ్లన్నీ బురదమయంగా మారుతాయి. ఆ రోడ్ల వెంబడి పిల్లలు, వృద్ధులు నడవాలంటే భయమేస్తుంది. బురద రోడ్ల వెంబడి కాలుజారి పడి గాయాలపాలైన ఉన్నాయి.

తాగునీరు లేదు

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు చేపడుతున్నా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. మిషన్ భగీరథ ద్వారా అన్ని గ్రామాల్లో తాగునీరు అందిస్తున్నా గ్రామాల్లోని కొన్ని కాలనీలో నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు.

అభివృద్ధి చేయలేదు

● రవిగౌడ్, నల్లవెల్లి



ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారే తప్ప ఏమి అభివృద్ధి చేయలేదు. కాలనీలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు లేవు. వర్షాకాలం వస్తే నడవడానికి కష్టంగా ఉంది. అధికారులు స్పందించి సమస్య తీర్చాలి.

ఇంటి నెంబర్లు కేటాయించలేదు

● ఇంజమూరి నితిన్, సిర్నాపల్లి



15 ఏళ్లు గడిచిన ఇంటి నెంబర్లు లేవు. నెంబర్లు లేక ఇంటి పన్నులు కట్టలేకపోతున్నాం. దీంతో మా కాలనీలో అభివృద్ధి చేస్తలేరు. ఎన్నిసార్లు చెప్పిన అధికారుల స్పం దన లేదు. అధికారులు పట్టించుకోకపోతే ఎవరికి చెప్పాలి.

నిధులు వస్తే ఇందిరమ్మ కాలనీలను అభివృద్ధి చేస్తాం

● ఎంపీడీవో అనంత్‌రావు


సిర్నాపల్లి ఇందిరమ్మ కాలనీలో డ్రైనేజీ నిర్మాణానికి రూరల్ ఎమ్మెల్యే స్పందించి 20లక్షలు మంజూరు చేశారు. త్వరలోనే పనులను ప్రారంభిస్తాం. నల్లవెల్లి ఇందిరమ్మ కాలనీలో నిధులు వస్తే కాలనీ అభివృద్ధికి సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం చేపడుతాం.

ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలు

● ఇబ్బందుల్లో వేల్పూర్ మండల ప్రజలు ● పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు

ఆంధ్రజ్యోతి పరిశీలన


వేల్పూర్‌లో ప్రధాన రోడ్డు నుంచిఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం


మోతె వీధి రోడ్డు మధ్యలో ..


వేల్పూర్‌లో ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభం

వేల్పూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో అస్తవ్యస్తంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. అంతేకాకుండా పలు గ్రామాల్లో నివాసపు ఇళ్లపై నుంచి అతితక్కువ ఎత్తు నుంచి విద్యుత్ వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న దృశ్యాలు చాలా ఉన్నాయి. అలాగే గ్రామాలలోని వీధులలో అడ్డగోలుగా ఏర్పాటు చేసిన వీధి లైట్ల స్తంభాల వల్ల ప్రజలకు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్ల మూలమలుపుల వద్ద, రోడ్ల మధ్యలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. వాటి వల్ల గ్రామంలోని రోడ్లపై వాహనాలు వెళ్లలంటే ఇబ్బందిగా ఉందని వాహనదారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లమధ్యలో ఉన్న స్తంభాలను గమనించకుండా వెళ్తున్న వాహనదారులు పలు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లోని కొత్త ప్లాట్‌లు, కాలనీ వీధుల్లో చాలాచోట్ల ఇప్పటికి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయకపోవడంతో గత్యంతరం లేక కర్రలనే విద్యుత్ స్తంభాలుగా ఏర్పాటు చేసుకొని కాలం వెల్లదీస్తున్నారు. ఈ విషయాలను పలుమార్లు ప్రజాప్రతినిధులకు, ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించిన ఫలితం లేదని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కొన్ని గ్రామాల్లో చాలా ఏండ్లక్రితం వేసిన విద్యుత్ స్తంభాలు వంగిపోయినవి, తుప్పుపట్టినవి దర్శనమిస్తున్నాయి. ఇలాంటి ప్రమాదకరమైన విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ వైర్లు కన్పించినప్పటికి తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నా ట్రాన్స్‌కో అధికారులపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా అంటూ ట్రాన్స్‌కో అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను తొలగించి వేలాడుతున్న వైర్లను సరిచేసి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరమైన స్తంభాలను తొలగించాలి

● మొండి అశోక్, వేల్పూర్



గ్రామాల్లో వీధి రోడ్ల మధ్య ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి సురక్షిత ప్రాంతంలో కొత్తగా స్తంభాలను ఏర్పాటు చేయాలి. గ్రామాల్లోని వీధుల్లో నిత్యం ప్రజల సందడి ఉంటుంది. ఎలాంటి ప్రమాదాలు జరుగకముందే ట్రాన్స్‌కో అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టవల్సిన అవసరం ఎంతైనా ఉంది.


శివాలయంలో పూజలు చేస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్

సిద్దుల గుట్టపై ఘనంగా పల్లకీ సేవ

పెర్కిట్, మే 12(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నవనాథ సిద్దుల గుట్టపై సోమవారం భక్తి శ్రద్ధలతో పల్లకి సేవ నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు సిద్దుల గుట్టపైకి విచ్చేసి శివాల యంలో పంచామృతంతో, బిల్వపత్రాలతో అభిషేకం నిర్వహించి రామాల యం, దత్తాత్రేయ మందిరం, దుర్గమాత ఆలయాలలో ప్రత్యేక పూజ లు నిర్వహించారు. టీపీసీసీ అధికారి ప్రతినిధి ఏబీ శ్రీని వాస్(చిన్న) శివాలయంలో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ కమిటి వారు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బి. సుమన్, పీసీ గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, చరణ్‌రెడ్డి, జిమ్మి రవి, సంధ్య, బట్టు శంకర్, ప్రశాంత్‌గౌడ్, కొంతం మంజుల మురళి, హజారి సంతోష్, అలిశెట్టి నరేష్, రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంక్సాపూర్ దత్తాశ్రమంలో ఘనంగా దత్త మహాయాగం

వేల్పూర్, మే 12(ఆంధ్రజ్యోతి): అంక్సాపూర్ గ్రామంలోని దత్తాశ్రమంలో పాదరస లింగేశ్వర ఆలయంలో సోమవారం భక్తిశ్రద్ధలతో దత్తామహాయాగం ఘనంగా నిర్వహించారు. ఉదయం భక్తులు బాజ భజంత్రీల మధ్య ఘటాలతో గ్రామంలోని గ్రామ దేవతల ఆలయాల వరకు ఊరేగింపుగా వెళ్లారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పాదరస లింగం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దత్తామహాయాగం కార్యక్ర మాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.



దత్త మహాయాగం నిర్వహిస్తున్న భక్తులు, ఘటాలతో ఊరేగింపు

కమనీయం.. లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం


స్వామివారి మూల విరాట్


పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఆలయ చైర్మన్, ఈఈవో


స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం


భిక్కనూరు సిద్ధరామేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


పాల్గొన్న భక్తులు

మాచారెడ్డి, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నర్సింహస్వామి కల్యాణ మహోత్సవం కమనీయంగా కన్నుల పండువగా వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ ఘనంగా జరిపించారు. స్వామి వారికి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఆలయ చైర్మన్ కమలాకర్ రెడ్డి, ఈవో శ్రీధర్ రావు సమర్పించారు. చైర్మన్ దంపతుల చేతుల మీదుగా స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించడానికి వేలాదిమంది భక్తులు తరలివచ్చి కల్యాణ మహోత్సవంతో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కల్యాణం సందర్భంగా చాలామంది పుస్తె మెట్టెలతో పాటు ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చైర్మన్, ఈవో ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమి టీల చైర్మన్‌లు, వివిధ పార్టీల నాయకులు, వేదపండి తులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

సిద్ధరామేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

భిక్కనూరు: భిక్కనూరు మండలకేంద్రంలోని దక్షిణ కాశీగా బాసిల్లుతున్న సిద్దరామేశ్వర ఆలయంలో సోమవారం స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ సందర్భంగా స్వావివారిని ఆలయ అర్చకులు తీరొక్క పూలతో ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించు కుని మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా : రూరల్ ఎమ్మెల్యే



గంగమ్మదేవి ఆలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఇందల్వాయి, మే 12 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో గంగమ్మదేవి ఆలయ నిర్మాణం అభివృద్ధి కోసం కృషి చేస్తానని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు.సోమవారం బుద్ధపౌర్ణమిని పురస్కరించుకొని 40లక్షలతో నిర్మించనున్న గంగమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠాపన, కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ఆలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్లారెడ్డిపల్లిలో గంగమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠాపన చేయడం ఆనందంగా ఉందని గంగమ్మదేవి ఆశీస్సులతో గ్రామస్తులంతా సుఖ సంతోషాలు, పాడిపంటలతో దీవించాలని అన్నారు. గతంలో ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు కళ్యాణ మండపానికి రూ.3లక్షల నిధులు మంజూరు చేశానని గంగమ్మదేవి ఆలయ అభివృద్ధి కోసం రోడ్లు, హైమాక్స్ లైట్లు, కల్వర్టు నిర్మాణం చేపడుతానని గ్రామ స్తులకు హామీ ఇచ్చారు. నా చేతుల మీదుగా గంగ మ్మదేవి విగ్రహ ప్రతిష్ఠాపన చేయడం నా అదృష్టంగా భావిస్తున్నానని అన్నా రు. ఆలయంలో నిత్య పూజారి కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, శేఖర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యుడు అంపరి నర్సయ్య, దత్త సురేష్, అబ్బ శ్రీనివాస్, రమేష్, కర్నమోహన్, చింతకింది నర్సయ్య, గంగాధర్, దప్పు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గంగారెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డిని సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పరామర్శించారు. ఇటీవల ఆయన కాలు ఆపరేషన్ చేసుకొని ఇంటికి తిరిగి వచ్చిన గంగారెడ్డిని పరామర్శించారు. ఆపరేషన్ జరిగిన విషయాన్ని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పీసీసీ డెలిగేట్ చంద్రశేఖర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు భాస్కర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ధర్పల్లిలో ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



ధర్పల్లిలో కేక్ కట్ చేస్తున్న వైద్య సిబ్బంది

ధర్పల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోగల ప్రభుత్వ 30 పడకల ఆసుపత్రిలో సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఆధునిక నర్సింగ్ వ్యవస్థాపకురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని పురస్కరించుకొని ప్రపంచ వ్యాప్తంగా మే 12న నర్సుల దినోత్సవాన్ని జరుపుకుంటారని మండల వైద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. ఆర్థిక వ్యవస్థ సమాజం సంస్కృతిపై ఈ వృత్తి ప్రభావం గుర్తించడం ఈ దినోత్సవ లక్ష్యమని 1982లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవంతో సమానంగా మే 12 నుంచి జాతీయ నర్సుల వారోత్సవాలు జరుపుకోవాలని యునైటెడ్ స్టేట్ అధికారికంగా ప్రకటించిందని ఆయన తెలిపారు.ఈసందర్భంగా ఆసుపత్రి నర్సింగ్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్ సృజన, మమత, సిబ్బంది పద్మ, కృష్ణ, సురేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నర్సింగ్‌స్టాఫ్‌కు సన్మానం

ఆర్మూర్‌టౌన్:పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో నర్సింగ్ డేను పురస్కరించుకొని విధులు నిర్వహిస్తున్న నర్సింగ్ స్టాఫ్ ను ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ నర్సింగ్‌డే సందర్భంగా ప్రభు త్వ ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న నర్సింగ్‌స్టాఫ్ శాలువతో స న్మానించి వారి సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రవికుమార్, డాక్టర్ అమృత్‌రామ్‌రెడ్డి,గీత, పాల్గొన్నారు

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మోపాల్, మే 12 (ఆంధ్రజ్యోతి):ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాస్బాగ్ తాండా వాగులో నుంచి అక్రమంగా ట్రాక్టర్‌పై ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెండు ట్రాక్టర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే పోలీసులకు సమా చారం అందించాలని కోరారు.

బైరాపూర్‌లో కుస్తీ పోటీలు

మోపాల్, మే 12 (ఆంధ్రజ్యోతి):మండలంలోని బైరాపూర్ గ్రామంలో పోచమ్మతల్లి జాతర సందర్భంగా సోమవారం మధ్యాహ్నం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలను నిర్వహించారు. ఈ కుస్తీ పోటీలో మోపాల్ మండలంతో పాటు ఆదిలాబాద్, మహారాష్ట్రకు చెందిన కుస్తీ వీరులు పాల్గొన్నారు. ప్రతీ సంవత్సరం పాడిపంటలు, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని గ్రామంలో ఉన్న పోచమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, జాతరను నిర్వహిస్తున్నట్లు వీడీసీ పెద్దలు తెలిపారు. గ్రామ ప్రజలే కాకుండా చుట్టుపక్కల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. రెండు రోజుల పాటు పెద్ద ఎత్తున జాతర నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో గ్రామ వీడీసీ పెద్దలతో పాటు ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

బీజేవైఎం అధ్యక్షుడిగా సునీల్‌కుమార్



సునీల్‌కుమార్

నిజామాబాద్‌రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి):భారతీయ జనతాపార్టీ నిజా మాబాద్ జిల్లా సంస్థాగత నిర్మాణంలో భాగంగా సారంగపూర్ హనుమాన్ నిజామాబాద్ రూరల్ కార్పొరేషన్ మండల బీజేవైఎం అధ్యక్షుడిగా మామిడాల సునీల్‌కుమార్ నియమితులయ్యారు.ఈ మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు.బీజేపీ సిద్ధాంతం ఆదర్శాలకు పున రంకి తమై నీతి,నిజాయితీ,నిబద్ధత,క్రమశిక్షణ,చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. తనపై నమ్మకంతో తనను బీజేవైఎం అధ్యక్షుడిగా నియ మించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలు చేస్తామని పార్టీని సంస్థాగతంగా బలుపరుస్తానని ఆయన తెలిపారు.

ఘనంగా లక్ష్మీనర్సింహాస్వామి కల్యాణోత్సవం



డిచ్‌పల్లిలో నర్సింహాస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

డిచ్‌పల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో సోమవారం పాలరాతి దేవాలయంలో కొలువైన లక్ష్మీనర్సింహాస్వామి ఉత్సవాల్లో భాగంగా వడియాల్ రవికుమార్ కల్యాణోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు గోపీకృష్ణ ఆధ్వర్యంలో ఈ కల్యాణోత్సవం నిర్వహించారు. పురోహితులు అరుణ్‌కుమార్‌శర్మ, సురేష్‌శర్మ, సాయిశంకర్‌శర్మ, గోపిశర్మల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం కన్నుల పండుగగా సాగింది. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రజావాణికి 121 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

నిజామాబాద్ అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి):ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 121 వినతులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్, నిజామాబాద్ ఇంచార్జి ఆర్‌డీవో స్రవంతి, నిజామాబాద్ ఏసీపీ రాజావెంకటరెడ్డిలకు విన్నవిస్తూ వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడూ పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

నగరంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజావాణిలో విద్యార్థి సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ ప్రతినిధులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎలాంటి అర్హతలు లేకుండా, ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా కోచింగ్ సెంటర్లను నిర్వహిస్తూ లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు మహేష్, కిరణ్, జ్వాలా, అంజలి, యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.

● విద్యాసంస్థ పేరుతో మోసం చేస్తున్నారని ఫిర్యాదు

నగరంలోని బైపాస్ రోడ్‌లో నేషనల్ మార్ట్ వెనక నూతనంగా నిర్మిస్తున్న భవనంలో ఓపాఠశాల సీబీఎస్‌ఈ పాఠశాల ఏర్పాటు అవు తుందని చెబుతూ కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు అడ్మిషన్లు చేస్తున్నారని టీజీవీపీ నాయకులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.ఈ కార్యక్రమంలో టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్, నాయ కులు మహేష్ వినయ్, తదితరులు పాల్గొన్నారు.

● కలెక్టర్‌కు పొగాకు రైతుల ఫిర్యాదు

రెంజల్: మండలంలోని బోర్గాం గ్రామానికి చెందిన పొగాకు రైతులను ఆదుకోవాలని కోరుతూ సోమవారం రెంజల్ సొసైటీ చైర్మన్ మొయినోద్దీన్ ఆధ్వర్యంలో పొగాకు రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. రెంజల్ మండలంలోని పొగాకు రైతులు 800ఎకరాలలో పొగాకు సాగు చేశారని చేతికి వచ్చిన పంటను కొనుగోలు చేయుటకు గత సంవత్సరంలో వీఈఎస్‌డీపీటీపీ బొమ్‌డాల కేఆర్‌కే అలియన్స్ తదితర కంపెనీలు గత సంవత్సరం క్వింటా పొగాకు ధర రూ.13800కొనుగోలు చేసిన కంపెనీలు ఈ సంవత్సరం క్వింటాలుకు రూ.8వేలకు కొనుగోలు చేస్తామని ముందుకు రావడంతో సదరు పొగాకు పండించిన రైతులు నష్టాన్ని చవిచూడడం జరుగుతుందని, గత సంవత్సరం కొనుగోలు చేసిన మద్దతు ధర ప్రకారమే ఈ సంవత్సరం కూడా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బోర్గాం గ్రామ రైతులు పాల్గొన్నారు.

జిల్లా అంతటా ఘనంగా వైశాఖ పౌర్ణమి వేడుకలు

నిజామాబాద్‌కల్చరల్, మే 12 (ఆంధ్రజ్యోతి):జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో ఘనంగా వైశాఖ పౌర్ణమి పూజలు నిర్వహించారు.ఆలయాల్లో కొలువుదీరిన దేవతా మూర్తులకు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. పలు ప్రాంతాల్లో బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని బుద్ధుని విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. యోగా,ధ్యాన కేంద్రాలలో యోగా గురువులు శిక్షకులచే ధ్యానంచే యించారు. పలు ఆలయాల్లో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించగా మరికొన్ని ఆలయాల్లో పౌర్ణమి అన్నప్రసాదాలు జరిగాయి.

● మహాగణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు

నగరంలోని రఘునాథ చెరువు వద్ద గల మహాగణపతి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని గణనాథునికి విశేష పూజలు నిర్వహించారు. గణపతికి పంచామృత అభిషేకాలు నిర్వహించి సిందూర సమర్పణ చేశారు. స్వామికి అన్నప్రసాదాన్ని సమర్పించుకొని భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భూషణ్‌చారి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



అన్నప్రసాదం అందుకుంటున్న భక్తులు

ముప్కాల్: వైశాఖ పౌర్ణమిని పురష్కరిం చుకొని ముప్కాల్ మండలంలోని వెంచిర్యాల్ బంగారు వెంకన్న ఆలయంలో సోమవారం ఘనంగా వైశాఖ పౌర్ణమిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, యజ్ఞం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

హున్సాలో గౌతమి బుద్ధ మందిరం ప్రారంభం

బోధన్‌రూరల్,మే12(ఆంధ్రజ్యోతి): సాలూర మండలంలోని హున్స గ్రామంలో సోమవారం గౌతమి బుద్ధ మందిరాన్ని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు. బుద్ధ విహార్‌లో భారత రత్న బీఆర్ అంబేద్కర్, రమాబాయి విగ్రహలను ఆవిష్కరించారు. బుద్ధం, చరణం, గచ్ఛామి గీతాన్ని గ్రామస్థులు ఆలపించారు. హున్స గ్రామానికి చెందిన మాలలు ఒక్కతాటిపై ఉండి బుద్ధ మందిరం కోసం శ్రమించినందుకు ఎమ్మెల్యే వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, కేశ వేణు, డీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి చైర్మన్ చీల శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● అనంతరం ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సుధాకర్ చారి, వివిధ మండలాల అధ్యక్షులు గంగాదర్, పసులోటి గోపి కిషన్, సుదర్శన్, ఇంద్రకరణ్, అశోక్ గౌడ్, ఈర్వంత్ రావు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

● హున్స సహకార సంఘం నిర్మాణానికి భూమిపూజ

సాలూర మండలంలోని హున్స గ్రామంలో సహకార సంఘం నూతన భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని సోమవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.



హున్సలో గౌతమి బుద్ధ మందిరం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ మందర్నా రవి, పాలకవర్గ సభ్యులను రైతులకు ఇబ్బందులు కలగకుండా చేస్తున్న కృషిని అభినందించారు. రైతు వేదిక మరమ్మత్తులకు రైతు వేదిక చుట్టు ప్రహారి గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించగా అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి రైతు వేదిక చుట్టు ప్రహారి గోడ నిర్మాణం, మరమ్మత్తులకు వెంటనే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, కేశ వేణు, డీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డిచ సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, దాము తదితరులు పాల్గొన్నారు.

మిట్టపల్లిలో 8 కుటుంబాల సాంఘిక బహిష్కరణ

డిచ్‌పల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండలంలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన 8 కుటుంబాలను గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అకారణంగా సాంఘిక బహిష్కరణ చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు సోమవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంత్, సీపీ సాయిచైతన్యలకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అట్టి ఫిర్యాదులను డిచ్‌పల్లి ఎస్సై, సీఐ, స్థానిక విలేకరులకు అందజేశారు. గత ఏడాది సెప్టెంబర్ 15న గణేష్ నిమజ్జనం సందర్భంగా గ్రామానికి చెందిన తంగెళ్ల కిషన్, ఎం.శ్రీనివాస్ మధ్య చిన్నపాటి గొడవ వాగ్వాదం జరిగింది. ఈ గొడవతో గ్రామంలో సాంఘిక బహిష్కరణకు గురి చేశారని వీడీసీ కమిటీ సభ్యులు, మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్ చొరవతోనే తమకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని డిచ్‌పల్లి ఎస్సై, సీఐలకు ఫిర్యాదు చేసిన వారు కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు విధి లేకనే కలెక్టర్, సీపీలకు వినతిపత్రం సమర్పించినట్లు బాధితులు మాజీ సర్పంచ్ గణేష్, శ్రీనివాస్, తేలు గంగాధర్, మాసిపెద్ది రవి, ఒడ్డం నర్సయ్య, గోపు రాజేశ్వర్, గోపు చరణ్, నడిపి గంగారాంలు పేర్కొన్నారు. తమపై బహిష్కరణ వేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మిట్టపల్లి బాధితులు

ప్రతీ ఒక్కరికి న్యాయసేవలు అందించాలి

● సీనియర్ సివిల్ న్యాయాధికారి ఉదయభాస్కర్ రావు



గ్రామప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న న్యాయాధికారి

నిజామాబాద్ లీగల్, మే 12 (ఆంధ్రజ్యోతి): భారత న్యాయ చట్టాలు అందరికీ తెలియాలని ప్రతి ఒక్కరికి న్యాయసేవలు అందించాలి దేశంలోని అట్టడుగు వర్గాలకు సైతం న్యాయం అందించాలన్న ప్రధాన లక్ష్యంతో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ పనిచేస్తుందని సీనియర్ సివిల్ న్యాయాధికారి మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి జి ఉదయభాస్కర్ రావు అన్నారు. సోమవారం నాడు డిఎల్ఎస్ఏ సెక్రటరీ మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో గల మోక్షనంత బుద్ధ విహారంను సందర్శించి, బుద్ధ విహార్‌లో జ్యోతి ప్రజ్వల గావించి తిమ్మాపూర్ గ్రామ ప్రజలకు న్యాయ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో మాట్లాడుతూ డిఎల్ఎస్ఏ ద్వారా గ్రామాలలో ఉన్న సివిల్ తగాదాలను మరియు బ్యాంకు రుణాలు, భార్యాభర్తల మధ్య, అన్నదమ్ముల మధ్య తగాదాలకు రాజీ కుదరచటం,రాజీమార్గమే రాజమార్గం అన్న సిద్ధాంతంతో పలు అపరిష్కృత వ్యాజ్యాలు, రాజీమార్గము ద్వారా సంవత్సరాలుగా న్యాయం కోసం నిరీక్షించే తమ యొక్క కోర్టు కేసులను శాశ్వతంగా పరిష్కరించుకొనటానికి ఓ చక్కని వేదికగా పనిచేస్తుందని లోక్ అదాలత్‌లో ఇవ్వబడిన అవార్డులు సుప్రీంకోర్టులో సైతం అపిల్‌కు ఆస్కారం లేనట్లుగా శీఘ్ర న్యాయ తీర్పుతో కక్షిదారులకు సమయము,డబ్బు ఆదా చేయబడుతుందని తెలియజేశారు.అనంతరం గ్రామా ప్రజలకు కరపాత్రలు అందజేశారు.ఈ కార్యక్రమంలో మోక్షనందా స్వామి మరియు తిమ్మాపూర్ గ్రామం ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ జన్మదిన వేడుకలు



ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి):నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో బీజేపీ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ధన్‌పాల్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు జరిపారు. నగరంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో, నీలకంఠేశ్వర ఆలయంలో ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. నీలకంఠేశ్వర ఆలయంలో మహా అన్నదాన కార్యక్రమం, దుబ్బ అరుంధతినగర్‌లో అన్నదానం, కొత్త గంజ్‌లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్యవైశ్య పట్టణ సంఘంలో, మార్వాడి డిఎస్ఎన్ కార్యాలయంలో సుమారు 100 మందికి పైగా రక్తదానం చేశారు. ఖిలీల్‌వాడిలో పలుచోట్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. తన మీద చూపిస్తున్న ప్రేమకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పసుపు బోర్డు చైర్మన్ పల్లెగంగారెడ్డి, నాగొళ్ల లక్ష్మినారాయణ, బీజేపీ నాయ కులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ అర్బన్:అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి రోగులకు ఎమ్మెల్యే పండ్లు పంపిణీ చేశారు. నగరంలోని వీరభద్ర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకొని బీజేపీ నాయకులు ఇల్లెందుల ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సేవా కార్యక్రమంలో భాగంగా 28వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ ఇల్లెందుల మమత ఆధ్వర్యంలో పేదలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మరెన్నో జన్మదినాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

● జిల్లాఉపవైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్



రోగులను పరిశీలిస్తున్న డాక్టర్ తుకారాం రాథోడ్

ఇందల్వాయి,మే 12 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లాఉపవైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న సేవల గురించి ఆరాతీశారు. ఔట్‌పేషెంట్, ఇన్‌పేషెంట్ వార్డులను పరిశీలించారు. వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ క్రిస్టినాను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆరోగ్య కార్యకర్తలతో సమావేశమై వడదెబ్బకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఈకార్యక్రమంలో ఆయుష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భువన, ఆరోగ్య విస్తరణ అధికారి శంకర్, నర్సింగ్ ఆఫీసర్ ప్రకాశ్, ల్యాబ్ టెక్నిషియన్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

డిచ్‌పల్లి,మే 12 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ప్రభాకర్ సూచించారు.సోమవారం మానవతసదన్‌లో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు వేసవి సెలవులను ఉద్దేశించి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు సెలవుల్లో ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ సెక్రెటరీ సీతయ్య, సదన్ కోఆర్డినేటర్ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నిజామాబాద్‌అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి):నగరంలోని సుభాష్‌నగర్‌లో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. హమాల్‌వాడికి చెందిన బీటెక్ విద్యార్థి మందుల ఆకాశ్ (21) ఆదివారం రాత్రి తన స్నేహితుడు దీపక్ ఇంట్లో శుభకార్యంలో పాల్గొని అర్ధరాత్రి ఖలీల్‌వాడి వైపు వెళ్తుండగా జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట ఆటోను ఢీకొట్టాడు. వేగంగా ఆటోను ఢీకొనడంతో ఆకాశ్ తలకు బలమైన గాయాలు అయ్యాయి.దీంతో సంఘటన స్థలంలోనే ఆకాశ్‌మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు 3వ టౌన్ ఎస్సై తెలిపారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

మాక్లూర్, మే 12(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు సద్విని యోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారులు డాక్టర్ కిరణ్‌దేశ్‌పాండే, డాక్టర్ ఉమామా సాహేర్ తెలిపారు. సోమవారం మండలంలోని మామిడిపల్లి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు.ఈకార్యక్రమంలో పశువైద్యధికారులు పాల్గొన్నారు.



చికెన్ ధరలు



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.130	రూ.240	రూ. 260
వెన్‌కాబ్(కిలో)	: రూ.140	రూ.250	రూ. 270



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.96,100	రూ.89,500	రూ.1000

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : షిన్ చాన్ అవర్ డైనోసర్ డైరీ (తెలుగు) (11.20)
: సింగిల్ (1.40, 4.40, 7.25, 10.10)
స్క్రీన్-2 : తుదురం (11.00)
: శుభం (2.20, 5.00, 7.40, 10.20)
స్క్రీన్-3 : రైడ్-2 (హిందీ) (10.20, 1.15, 7.20)
: హిట్-3 (4.10, 10.20)
స్క్రీన్-4 : జగదేకవీరుడు అతిలోక సుందరి (10.45, 2.00, 7.30)
: షిన్ చాన్ అవర్ డైనోసర్ డైరీ (తెలుగు) (5.10)
: రైడ్-2 (హిందీ) (10.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1: సింగిల్ (11.00, 4.40)
: హిట్-3 (1.30, 7.30)
: జగదేకవీరుడు అతిలోక సుందరి (10.30)
స్క్రీన్-2 : సింగిల్ (1.30, 7.30, 10.30)
: శుభం (4.40)
స్క్రీన్-3 : జగదేకవీరుడు అతిలోక సుందరి (11.00, 4.30)
:శుభం (1.40, 7.20, 10.20)

లలితామహాల్ : శుభం (11.15, 2.15, 6.15, 9.15)
దేవి : సింగిల్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : జగదేకవీరుడు అతిలోక సుందరి (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : హిట్-3 (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్